నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం 22 మార్చి 2023

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం



నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలో స్థానిక ఎస్బిఐ బ్యాంక్ ఎటిఎం సెంటర్‌లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఏటీఎం షటర్ ధ్వంసం చేసి ఏటీఎం లో ఉన్న నగదు చోరీకి ప్రయత్నం చేయగా ఏటీఎం నగదు డోర్ ఓపెన్ కాకపోవడంతో దుండగులు తిరిగి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు మంగళవారం ఉదయం ఏటీఎం సెంటర్‌కు వెళ్లి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎస్బిఐ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్ గౌడ్ తెలిపారు.

వైద్య సిబ్బందికి సన్మానం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని బట్టు తండా లో కంటి వెలుగును పూర్తిచేసి సేవలు అందించిన వైద్య సిబ్బందికి మంగళవారం గ్రామపంచాయతీ తరపున శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రెడ్డి నాయక్ మాట్లాడుతూ.. గ్రామానికి కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా సేవ చేసిన వైద్యులకు గ్రామం తరపున ప్రభుత్వానికి, వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లచ్చిరాం, వైద్యురాలు సునీత, సిబ్బంది శ్రీనివాస్, రాణి, గ్రామస్తులు చంద్రు నాయక్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందికి సన్మానం

నీటి ఎద్దడి రానీయొద్దు

- ముందస్తు పనులు చేపట్టాలి
- కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

జిల్లాలో నీటి ఎద్దడి ఏర్పడకుండా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్లో మంగళవారం నీటి ఎద్దడి నివారణ పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీల పరిధిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు ముందు జాగ్రత్తగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో పట్టణాల్లో, గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేసే విధంగా అధికారులు చూడాలని చెప్పారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ఉపాధి హామీ కూలీలకు, స్వయం సహాయక సంఘాల మహిళలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టిని పెట్టాలని సూచించారు. మురుగు కాలువలలో పూడిక తీయించి, ఆయిల్ బాల్స్ వేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని నర్సరీ లో మొక్కలు పెరిగే విధంగా సంరక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వాతావరణ మార్పు, ఆరోగ్య ప్రభావాలు అనే గోడప్రతులను జిల్లా అధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, డిఆర్డిఓ సాయన్న, డిపిఓ శ్రీనివాసరావు, జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్ సింగ్, మున్సిపల్, మిషన్ భగీరథ, ఆర్డ్ బ్ల్యూఎస్, విద్యుత్తు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయండి

- సీపీఐ(ఎం) జోన్ కార్యదర్శి కొత్త నరసింహులు

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రజాచైతన్య యాత్రను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) భిక్కనూర్ జోన్ కార్యదర్శి కొత్త నరసింహులు సూచించారు. మంగళవారం మండలంలోని జంగంపల్లి గ్రామంలో ప్రజా చైతన్య యాత్ర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 24న నిజామాబాద్ లో ప్రారంభమవుతున్న ప్రజా చైతన్య యాత్ర కామారెడ్డి మున్సిపల్ జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని, ప్రజలను చైతన్య ప్రచారానికి, దేశంలో బిజెపి అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించడానికి మాజీ ఎంపీ విజయ రాఘవన్, ప్రముఖ ముఖ్య నాయకులు పాల్గొంటున్నారన్నారు. 2000 మందితో మున్సిపల్ ముందు భారీ బహిరంగ సభ ఉంటుందని, ఈ సభకు మండలం నుంచి కాకుండా వివిధ జిల్లాల నుండి కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 25న కామారెడ్డి జిల్లాలోని జంగంపల్లి, భిక్నూర్ మీదుగా బస్వాపూర్ వరకు యాత్ర చేరుకోనుందని, జంగంపల్లి గ్రామంలో ఘనంగా స్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, నర్సింలు, చంద్రకళ, నరసవ్వ, అర్జున్, దేవరాజ్, పోశయ్య తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూర్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, ప్రజలు

ప్రజల కోసమే టీఎస్ఆర్టీసీ

- ఆర్ఎం ఉషాదేవి

నవతెలంగాణ-మద్నూర్

ఆర్టీసీ బస్సు సౌకర్యం ప్రజల కోసమే నడుపుతుందని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఉషా దేవి తెలిపారు. ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమాన్ని మంగళవారం నాడు డోంగ్లి మండలంలోని కుర్లా గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ బస్సు సౌకర్యాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వివరించారు. ప్రజలు ప్రైవేటు వహనాలు కాకుండా ఆర్టీసీ బస్సులను వినియోగించుకొని ఆర్టీసీని ఆదరించాలని కోరారు. విద్యార్థులకు, వికలాంగులకు ప్రత్యేక రాయితీ పాస్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల ప్రజలు ఆర్టీసీ బస్సులు ఆదరిస్తున్నందుకు రీజినల్ మేనేజర్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు 10 శాతం రాయితీపై శుభ కార్యక్రమాలకు అద్దెకు బస్సులు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కుర్ల సర్పంచ్ ప్రమీల యావంత్ రావు పటేల్, పెద్ద టాకిలి సర్పంచ్ విలాస్, డోంగ్లి సర్పంచ్ శశాంక్ పటేల్, వీలగావ్ సర్పంచ్ చాంద్ పటేల్, మరియు బోధన్ డిపో మేనేజర్ టిఎస్ స్వామి, సిఐ జనాభాయ్, వెల్ఫేర్ బోర్డు మెంబర్ శ్రీనివాస్, ఎస్‌విరావు, (సిఆర్‌సి) సందీప్ గౌడ్, డిఐ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉషాదేవి

అనాథల స్వచ్ఛంద సంస్థకు భారీ విరాళం

నవతెలంగాణ-పిట్లం

అంధుల, అనాథల స్వచ్ఛంద సేవా సంస్థ సోచ్ (హైదరాబాద్)కు మండల కేంద్రంలోని బ్లూ బెల్స్, రిచ్ మైండ్స్ పాఠశా లలు మంగళ వారము విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సేవా సంస్థ వారు ఆయా పాఠశాలల్లో నిర్వహించిన ప్రదర్శనలు, మాట్లాడిన మాటలు , విద్యార్థులలో ఎంతో స్ఫూర్తి కలిగించి ఆకట్టుకున్నాయి. స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవకు గాను బ్లూ బెల్స్ పాఠశాల విద్యార్థుల నుండి సేకరించిన విరాళాలు రూ. 1,29,450 కాగా, రిచ్ మైండ్స్ పాఠశాల నుండి సేకరించిన 31 వేల 500 రూపాయల విరాళాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంధుల, అనాథల స్వచ్ఛంద సేవా సంస్థ బృందం, స్థానిక బ్లూ బెల్స్, పాఠశాల నిర్వాహకులు సంజీవరెడ్డి, రజిని, రిచ్ మైండ్స్ పాఠశాల యాజమాన్యం కిషన్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేత

ఒక్కటైతే రాజ్యాధికారం బహుజనులదే

నవతెలంగాణ-తాడ్వాయి

బహుజనులందరూ ఒక్కటై ఐక్యంగా ఉంటే రాజ్యాధికారం తమదే అని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు వనం గంగాధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మంగళవారం బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా.. ఆయన మాట్లాడారు. బీసీ జనగణ తప్పకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాలని, అప్పుడే ఉద్యోగ ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి, బీసీ లెక్కలు తీయాలి అని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు సాప శివరాములు నేత, జిల్లా ఉపాధ్యక్షులు మారాజు మోహనాచారి, రాజయ్య, అబ్దుల్ అజీజ్, కామారెడ్డి జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి వడ్ల సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాదిని శాంతియుతంగా నిర్వహించుకోవాలి

నవతెలంగాణ-దోమకొండ

ఉగాది పండుగను శాంతియు తంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ సురేశ్ తెలిపారు. మండల కేంద్రంలో ఉగాది పండగ సందర్భంగా ఎడ్ల బండ్ల ప్రదర్శన కార్యక్రమంపై పీస్ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సురేష్, తహసీల్దార్ కౌశిక మాట్లాడారు. ఉగాది పండగను ప్రజలు శాంతి యూతంగా జరుపుకోవాలని, ఎడ్ల బండ్లు సీరియల్ ప్రకారం వెళ్లాలని, శాంతి యూతంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా, పోలీస్ బృందం, రెవిన్యూ సిబ్బంది ఉంటారని, ప్రజలు ఉగాది పండగ చేపట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ సుధాకర్, జడ్పీటీసీ, సర్పంచ్ అంజలి గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ

నేరల్‌లో నేడు కుస్తీపోటీలు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని నెరల్ గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నేడు కుస్తీ పోటీలు నిర్వహిస్తునట్లు సర్పంచ్ శివనోళ్ళ సుజాత సాయిలు గ్రామ కమిటీ సభ్యులు మంగళవరం తెలిపారు. కొబ్బరికాయ కుస్తీ మొదలుకొని 5 వెండి కడియాల కుస్తీ పోటీల వరకు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కుస్తీ పోటీలు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు నిర్వహిస్తామని మల్లయోధులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చదువుతోనే గుర్తింపు

- పది విద్యార్థులకు విజయస్ఫూర్తి

నవతెలంగాణ-సదాశివనగర్/దోమకొండ/రామారెడ్డి

సదాశివ నగర్ మండలంలోని పద్మాజి వాడి ఉన్నత పాఠశాలలో హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ తరపున పదవ తరగతి విద్యార్థులకు విజయ స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు మురళి, కృష్ణారావు, కాట్మండీ సంతోష్ కుమార్ లు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని ప్రతి ఒక్క వ్యక్తికి చదువుతూనే గుర్తింపు లభిస్తుందని, ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదుగుతే దేశం పురోగతి సాధిస్తుందని, ఆత్మవిశ్వాసంతో భయం లేకుండా పరీక్షలు రాసి విజయాన్ని సాధించాలని తెలిపారు. ఎవరైతే కృషిని నమ్ముకుంటారో వారు మాత్రమే విజేతలుగా ఎదుగుతారని తెలిపారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు కామారెడ్డి రూరల్ పిఆర్టియు ప్రధాన కార్యదర్శి కృష్ణారావు ఆర్థిక సహాయంతో పరీక్ష కిట్లను అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ కోఆర్డినేటర్ కృష్ణకర్ రావు, పిఆర్‌టియు నాయకులు రామ్మోహన రావు, మురళి, నరేందర్, కృష్ణారావు, కట్మండి సంతోష్, పాఠశాల ఉపాధ్యాయులు దామోదర్ రెడ్డి, లక్ష్మీరమ్, రాజు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

రామారెడ్డి : మండలంలోని మద్దికుంట, రెడ్డి పేట తండా జిల్లా పరిషత్ పాఠశాలలో హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ఇలాంటి సామాగ్రిని అందజేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మద్దికుంట సర్పంచ్ రామ్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఆంజనేయులు, ఏపీవో ధర్మారెడ్డి, ఇసాయిపేట్ నరేష్, యాదయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సదాశివనగర్ : విద్యార్థులకు పరీక్ష అట్టల అందజేత

స్టడీ మెటీరియల్ అందజేత

నవతెలంగాణ-బీబీపేట్(దోమకొండ)

బీబీపేట్ మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం వద్ద మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన నిరుద్యోగ యువతకు సేవ్ ది గర్ల్ చైల్డ్ సంస్థ ఫౌండర్ చంచల్ గూడ ఎస్పీ నవాబ్ శివకుమార్‌గౌడ్ సహకారంతో గ్రూప్ 4 ఎగ్జామ్‌కు సన్నద్ధం అవుతున్న ఆరుగురు నిరుద్యోగ అభ్యర్థులకు అవసరమయ్యే స్టడీ మెటీరియల్‌ను రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ అంకన్నగారి నాగరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ అంకన్నగారి నాగరాజ్‌గౌడ్ మాట్లాడుతూ సేవ్ ది గర్ల్ చైల్డ్ సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు ఎస్పీ శివకుమార్ గౌడ్ అందిస్తున్నారని వారి సహకారంతో స్టడీ మెటీరియల్ ఉచితంగా పొందిన నిరుద్యోగు అభ్యర్థులు స్టడీ మెటీరియల్‌ను చక్కగా వినియోగించుకుని ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని కోరారు. అడగగానే స్టడీ మెటీరియల్ అందించిన జైళ్ల శాఖ ఎస్పీ శివకుమార్ గౌడ్ కు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.



నిరుద్యోగ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

వర్షానికి దెబ్బతిన్న పంటల పరిశీలన

నవతెలంగాణ-భీంగల్/ధర్పల్లి/ఆర్మూర్

మండలంలోని గోన్‌గొప్పుల, సికింద్రాపూర్ గ్రామాలలో రెండురోజుల క్రితం కురిసిన వడగండ్ల వానతో దెబ్బతిన్న వరి పంటలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాయుడు, భీంగల్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు మల్లయ్యలతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పంటపొలాలను క్షేత్రస్థాయిలో వెళ్లి నష్టాన్ని అంచనా వేశారు. పరిశీలించిన పంట వివరాలను ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపను న్నట్టు జిల్లా అధికారి తెలిపారు. వీరి వెంట పర్పంచ్‌లు రాగి అనసూయ, ఎంపీటీసీ ప్రమీల, మండల వ్యవసాయశాఖ అధికారి సాయికృష్ణ, ఏఈఓ మౌనిక, గోన్‌గొప్పుల రైతుబంధు సమితి అధ్యక్షుడు శ్రీరాముల భూమేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు నర్సయ్య, చారీ రైతులు ఉన్నారు.

వడగండ్ల వానతో నష్టపోయిన పంటలు పరిశీలన..

ధర్పల్లి : గత నాలుగు రోజుల క్రితం కురిసిన వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలకు జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. మండలంలోని రేకులపల్లి శివారులోని వరి పంట నష్టం జరిగినట్టు ఆయా గ్రామాల రైతులు మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ దృష్టికి తీసుకురాగా ఆప్రాంతాన్ని సందర్శించి నష్ట వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించినట్టు ఏఓ తెలిపారు. కార్యక్రమంలో వారి వెంట సర్పంచ్ రాజేందర్, ఎంపీటీసీ కర్ణాకర్ రెడ్డి, ఏఈఓ రైతులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలి..

ఆర్మూర్ : అకాల వర్షంతో చేతికొచ్చిన పంటలు దెబ్బతిని రైతులు రోధిస్తున్నారని, పంటలను పరిశీలించి నష్టపరిహారాన్ని అందించాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో వడగండ్ల వానలకు వేలాది ఎకరాలు పంటలు నేలమట్టం అయ్యాయని ఆయన అన్నారు. రాష్ట్రంలో తుఫాన్‌తో లక్షలాది ఎకరాలు పంట నష్టం జరిగిందని, కనుక ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పరిశీలించి రైతన్నలకు ఆదుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

లింగంపేట్ : లింగంపేట్ మండలంలోని సంగారెడ్డి గ్రామపంచాయతీ పరిధిలోని లొంకలపల్లి గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రశాంత్ కుమార్ పీఎస్‌బీ వాడిన వరి పంటను మంగళవారం క్షేత్రశాలకు వెళ్లి పరిశీలించారు. రైతు శ్రీధర్ రెడ్డి పంటను పరిశీలించి పీఎస్‌బీ ఉపయోగించడం వల్ల కలిగిన లాభాలపై వివరించారు. పంటలో పిలకలు బాగా వచ్చాయని, వేర్ల ఎదుగుదల బాగుందని అదేవిధంగా తెగుళ్ల ఉధృతి కూడా చాలా వరకు తగ్గిందని శ్రీధర్ రెడ్డి వివరించారు.



ధర్పల్లిలో పంటలు పరిశీలిస్తున్న అధికారులు

అంతర్జాతీయ నీటి దినోత్సవ అవగాహన

నవతెలంగాణ-తాడ్వాయి

రిలయన్స్ ఫౌండేషన్, జిల్లా భూగర్భ జలశాఖ ఆధ్వర్యంలో ఎండ్రియాల్ గ్రామంలో అంతర్జాతీయ నీటి దినోత్సవం నిర్వహించారు. జిల్లా భూగర్భ జలశాఖ అధికారి సతీష్ యాదవ్ మాట్లాడుతూ వాటర్ సైకిల్ (జలచక్రం) పూర్వకలానికి ప్రస్తుత నీటి పరిస్థితి తదితర అంశాలు వివరించారు. పూర్వం బావులు ఉండేవని, ఎక్కువగా వర్షధార పంటలు వేసేవారని, రానురాను గొట్టపు బావులు రావడంతో జనాభా పెరుగుదల బిడు భూములు సాగులోనికి వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయిరెడ్డి, రిలయన్స్ ఫౌండేషన్ డీపీవో వీరేశం, ఉపసర్పంచ్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మత్తడిపోచమ్మ జాతర

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల సమీపంలోని పెద్దవాగు సమీపంలో గల మత్తడి పోచమ్మ జాతర ఉత్సవాలు ఉగాది పర్వదినము బుధవారం నుండి వారం రోజులపాటు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షులు బొల్లారం సాయిలు మంగళశారం తెలిపారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మొదటి రోజు ఎడ్లబండ్ల ప్రదర్శన, రెండవ రోజు ప్రత్యేక పూజలు, మూడో రోజు అమ్మవారి ఊరేగింపు, నాలుగో రోజు రథోత్సవం, ఐదో రోజు కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి సందర్శకులు రానున్నారని, అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి ప్రతిరోజు వాటికి నీళ్లు పోసి సంరక్షించాలని ఎంపీపీ గాల్ రెడ్డి సూచించారు. మంగళ వారం మండలంలోని అంతంపల్లి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారి పక్కన ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా ఫారెస్ట్ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అడవులను సంరక్షించడంలో ఫారెస్ట్ అధికారుల పాత్ర ముఖ్యమైన దని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అనంతరావు, ఎప్డిఓ గోపాలరావు, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, సర్పంచ్ మధుమోహన్ రెడ్డి, ఎఫ్ఆర్వో రమేష్, ఎఫ్ఎస్ఓ అనురంజని, బీట్ ఆఫీసర్ దీపికా, జీపీ కార్యదర్శి స్నేహ పాల్గొన్నారు.

పలువురికి సన్మానం

నవతెలంగాణ-మద్నూర్

బిఆర్ఎస్వి విద్యార్థి విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షులుగా గైక్వాడ్ విలాస్ నియమితులు కావడం అభినందనీయమని డోంగ్లి మండలం బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు శశాంక్ పాటిల్ పేర్కొన్నారు. బిఆర్ఎస్వి కామారెడ్డి జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన గైక్వాడ్ విలాస్‌కు అలాగే ఇటీవల మద్నూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన హైమద్ హుస్సేన్‌కు మంగళవారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ డోంగ్లి సింగిల్ విండో చైర్మన్ రామ్‌పటేల్, డోంగ్లి మండల పార్టీ ఉపాధ్యక్షులు ఆనంద పటేల్, లింబూర్ గ్రామ సర్పంచ్ మధుకర్ పటేల్, బి ఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఐటీయూలో 2,400 మంది చేరిక..

- పోరాట సంఘంలోకే బీడీ కార్మికులు, టేకేదార్లు
- బీడీ రంగంపై ఆంక్షలు ఎత్తేయాలి
- చట్టబద్ధ సౌకర్యాల కోసం పోరు : ఎస్ రమ



సీఐటీయూలో చేరిన వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కామారెడ్డి జిల్లా దోమకొండ, బీబీపేట్ మండలాల నుంచి సుమారు 3 వేల మంది బీడీ కార్మికులు సీఐటీయూలో చేరారు. పోరాట సంఘంలోనే భాగస్వామ్యం అవుతామంటూ వివిధ సంఘాలకు రాజీనామా చేసి సీఐటీయూ జెండా పట్టారు. కార్మికులను రాష్ట్ర బీడీ కార్మిక సంఘం నాయకులు ఎస్ రమ సంఘంలోకి స్వాగతం పలికారు. కార్మిక హక్కుల పోరాటాలకు సీఐటీయూ కేరాఫ్‌గా నిలిచిందని ఈ సందర్భంగా అన్నారు. కార్మికుల చట్టబద్ధ సౌకర్యాల సాధనకు కామారెడ్డి జిల్లాలో భవిష్యత్తు ఉద్యమాలు చేపడతామని, జిల్లాను పోరాట కేంద్రంగా మలుస్తామని అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లాలో దోమకొండలోని పైడిమర్రి పంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో వివిధ సంఘాల నుంచి కార్మికులు సీఐటీయూలో చేరారు.

వివరాలు మెయిన్‌లో..

ఆటపాటతో చైతన్యం

- జన చైతన్య యాత్ర విజయవంతం కోసం ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో శిక్షణ



శిక్షణలో కళాకారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్ర అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ఆటపాటలతో ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం కల్పించేందుకు ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్టు పీఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింలు తెలిపారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న రాష్ట్ర స్థాయి శిక్షణా శిబిరాన్ని మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మల్లు స్వరాజ్యం ట్రస్ట్ భవనంలో ప్రారంభించారు. జెండాను పీఎన్ఎం జిల్లా కార్యదర్శి సిర్పలింగం ఆవిష్కరించారు.

వివరాలు మెయిన్‌లో..

రక్తదాతకు గవర్నర్ అభినందనలు

నవతెలంగాణ-తాడ్వాయి

కామారెడ్డి రక్తదాతల సమూహాన్ని 2007వ సంవత్సరం నుంచి ఏర్పాటు చేసి ఆపదలో ఉన్న వారికి 15,000 యూనిట్లకు పైగా రక్తాన్ని, కరోనా సమయంలో 100 యూనిట్ల ప్లాస్మాను, తమ సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం 800 యూనిట్ల రక్తాన్ని సేకరించినందుకు ఐవీఎఫ్ తెలంగాణ రాష్ట్ర సేవాదళ్ చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలును రాష్ట్ర గవర్నర్ తమిళ్ సై సౌందర్య రాజన్ అభినందించారు. వ్యక్తి గతంగా 69 సార్లు రక్తదానం చేయడం పట్ల అభినందించారు. ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని అందించడానికి యువకులు ముందుకు రావాలని అన్నారు. దేశ అభివృద్ధిలో,తెలంగాణ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని పేర్కొన్నారు.

ఎన్ఎస్ఎస్ క్యాంప్ ప్రారంభం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని మర్కల్ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. రాధిక మాట్లాడుతూ విద్యార్థులు జాతీయ సేవ పథకం ద్వారా సేవ భావాన్ని అలవార్చుకోవాలి అని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి . మాణిక్య రేఖ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి సి. అనిత, కమిటీ మెంబెర్స్ ఎండీ. ఆఫషా, నేహా విద్యార్థినిలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని హైదరాబాద్ మినిస్టర్ కార్యాలయంలో పట్టణానికి చెందిన సామాజిక సేవకులు శ్రీమాన్ కొటూరు అశోక్ మంగళవారం కలిశారు. ఇటీవల అకాల వర్షాల వల్ల జరిగిన తీవ్ర పంట నష్టాన్ని, నకిలీ విత్తనాలను అరికట్టాలని, నాణ్యమైన, అన్ని రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకొనే విత్తనాలను రైతులకు అందించాలని, అదే విధంగా కోతుల వల్ల పంటలకు జరుగుతున్న నష్టాన్ని గురించి, ఆహార పంటలను పండించేటపుడు ఎటువంటి క్రిమి సంహారకాలను, రసాయనాలను వాడకుండా సేంద్రియ పద్ధతిలో ఆర్గానిక్ కూరగాయలు, పండ్లు, ఆహార పంటలను పండించే విధంగా రైతులను ప్రోత్సహించడానికి తగు మార్గదర్శకాలను విడుదల చేయుటకు అధికారులను ఆదేశించాలని వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించి ఫిర్యాదు చేసిన అంశాలపై సంబంధిత అధికారులను ఆదేశించినట్టు తెలిపారు.

పేదలకు అండగా.. చారిటబుల్ ట్రస్ట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పేదలకి అండగా ధన్‌పాల్ లక్ష్మీబాయి విటల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఉందని ట్రస్ట్ చైర్మన్ ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త తెలిపారు. నిజామాబాద్ నగరంలోని మిర్చి కాంపౌండ్‌లోని అర్బన్ కార్యాలయంలో ఆ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ పంచారెడ్డి లింగం, కార్పొరేటర్ సుక్క మధు, బీజేపీ నాయకులు వినోద్ రెడ్డి, ఇల్లెందుల ప్రభాకర్, రోషన్ లాల్ బోరా, ఆనంద్, మఠం పవన్, దాత్రిక రమేష్, శివునూరి భాస్కర్, అంతిరెడ్డి హరీష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యం కోసం పోషకాహారం..

- తప్పకుండా తీసుకోవాలి
- పోషణమాసంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన

నవతెలంగాణ-ఎడపల్లి/బోధన్/రెంజల్/ఆర్మూర్

ప్రతి ఒక్క అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్‌లో భాగంగా ప్రతి అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ మాసం నిర్వహించాలని ఐసీడీఎస్ బోధన్ ప్రాజెక్ట్ ఎడపల్లి మండల పర్యవేక్షకురాలు వినోద అన్నారు. మంగళవారం మండలంలోని నెహ్రూ నగర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైస్ ఎంపీపీ ఇమ్రాన్‌ఖాన్ హాజరయ్యారు. అంగన్వాడీ కేంద్రానికి వచ్చే బాలబాలికలు ఆరోగ్యంగా ఉండడానికి పోషణ మాసం ఎంతో దోహదపడుతుందని ఆయన అన్నారు. చిన్నారి పిల్లలకు పండ్లు, ఫలహారాలు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా చిన్నారులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రం ఉపాధ్యాయురాలు



రెంజల్ : పౌష్టికాహారంపై అవగాహన

ఆర్.హేమమాలిని తదితరులు పాల్గొన్నారు.

జాడీజమాల్ పూర్‌లో పోషణ్ పక్వాడ ర్యాలీ..

బోధన్ : సాలూర మండలంలోని జాడిజమాల్‌పూర్ గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సెంటర్లో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా నూతన దంపతులు చిరుధాన్యాలతో చేసిన వంటకాలను ప్రదర్శించారు. బాలింతలు తక్కువ ఖర్చులో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగావేణి సూచించారు. అనంతరం గ్రామంలో ప్రతిజ్ఞ ర్యాలీ నిర్వహించారు. ఉత్తమ దంపతులను ఎంపికచేసి అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోగినేని జ్యోతి, ఏఈఓ ఉమా, అంగన్వాడీ టీచర్ సీహెచ్ చంద్రకళ, షేక్ మజార్ మహిళలు పాల్గొన్నారు.

రెంజల్ : మండలంలోని కిసాన్ తాండ గ్రామంలో పోషణ పదార్థాలపై అవగాహన కల్పించినట్టు ఐసీడీఎస్ సూపర్వైజర్ ప్రమీలరాణి తెలిపారు. చిరుధాన్యాల వల్ల ఎలాంటి మేలు జరుగుతుందని విషయంపై భార్యాభర్తలకు అవగాహన కల్పించి, వంటకాల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో రాగి జావా, మినప పిండి లడ్డూలు, రాగి లడ్డూలు, సజ్జ రొట్టెలను తయారు చేయించారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మలావత్ జమున, ఉప సర్పంచ్ పీర్ సింగ్, నాగు బాయి, విట్టల్, అంగన్వాడీ టీచర్ సుమలత, స్వప్న, వినోద, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : పట్టణంలోని రంగాచారినగర్ అంగన్వాడీ కేంద్రంలో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో మంగళవారం పోషణ అభియాన్ పోషణ పక్షోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ఈ నెల 20వ తేదీ నుంచి 15 రోజులుగా అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహిస్తామని నిర్వాహకురాలు అరుంధతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోషణ పక్షోత్సవాల కార్యక్రమంలో మహిళలు, గర్భిణీలు ఇంటింటా పోషణ సంబరాలను జరుపుకుంటున్నారని తెలిపారు. సరైన పోషణతో ఆరోగ్య తెలంగాణ సాధ్యమవుతుందని, పోషణ లోపం ఎక్కడా కనిపించకూడదని వివరించారు. కార్యక్రమంలో ఆయమ్మ చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-4 పరీక్ష కోసం ఉచిత కోచింగ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీసీ స్టడీ సర్కిల్ నిజామాబాద్ ఆధ్వర్యంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన బీసీ అభ్యర్థులకు టీఎస్‌పీఎస్‌సీ గ్రూప్-4 పరీక్ష కోసం ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్టు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ సీహెచ్ వెంకన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీలో మొదటి క్లాస్‌లో పాసైన అభ్యర్థులు వారి దరఖాస్తులను 31-03-2023 తేదీలోపు సుభాష్‌నగర్‌లోని నిర్మల హృదయ స్కూల్ ఎదురుగా, ఓల్డ్ బీఎస్ఎన్ఎల్ బిల్డింగ్ రెండవ అంతస్తులో గల బీసీ స్టడీ సర్కిల్‌లో నేరుగా అందజేయాలని తెలియజేశారు. మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. కోచింగ్ తరగతులు 04-04-2023 నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తొర్తి గ్రామంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో 3 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలను మంగళవారం భీంగల్ సీఐ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేరాల నియంత్రణ కోసం కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని, గ్రామంలో జరిగే అసాంఘిక కార్యకలాపాలను కెమెరాల సహాయంతో అడ్డుకట్ట వేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజు, వైస్ ఎంపీపీ సల్ల లావణ్య, సర్పంచ్ కుండ నవీన్, ఉపసర్పంచ్ తాహెర్, మున్నూరు కాపు సంఘ సభ్యులు వేశాల చిన్న నర్సయ్య జక్కు రాము, సల్ల రాజేశ్వర్, సల్ల రాజారాం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి



బస్సుపాసులను అందజేస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వికలాంగులు ఆర్టీసీ బస్సు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి అన్నారు. మంగళవారం కమ్మర్‌పల్లి ఐకేపీ కార్యాలయంలో బస్సు పాసుల దరఖాస్తు స్వీకరణ, జారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 46 మంది బస్సు పాసులకు దరఖాస్తు చేసుకోగా.. ఎంపీపీ చేతుల మీదుగా పలువురికి లాంఛనంగా 50శాతం రాయితీ పాస్‌లను జారీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం కుంట గంగారెడ్డి మాట్లాడుతూ.. ఐకేపీ మండల కార్యాలయంలో సదరం సర్టిఫికెట్ ఉన్న వికలాంగులకు స్థానికంగానే బస్సు పాసులు జారీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీసీలు భాగ్యలక్ష్మి, వర్దం శ్రీనివాస్, నవీన్, బీఆర్ఎస్ నాయకులు లోలపు సుమన్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ కమిటీ సమావేశం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



సమావేశమైన బాలల పరిరక్షణ కమిటీ

మండలంలోని ఉప్లూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో భీంగల్ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం సర్పంచ్ బద్దం పద్మ చిన్నారెడ్డి అధ్యక్షతన బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి నరేందర్ బాలల పరిరక్షణ కమిటీ ఉద్దేశాలను సమావేశంలో వివరించారు. బాల బాలికల అపహరణాలు జరగకుండా చూడడం, బాల్య వివాహాలను అరికట్టడం, సమాజంలో ఆడవారిపై జరుగుతున్న అత్యాచారాలు ఆపడం, చిన్న పిల్లలు శ్రమ దోపిడికి గురికాకుండా చూడడం, బడి ఈడు పిల్లలందరూ చదువుకునేలా చర్యలు తీసుకొని మంచి సమాజం ఏర్పరచడం కమిటీ ముఖ్య ఉద్దేశం అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ నరసింహ స్వామి, అంగన్వాడీ టీచర్లు అంజలి దేవి, సరిత, శోభ, పద్మ, ఏఎన్ఎం అరుణకుమారి, వీవోఏలు సువర్ణ, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-మెండోరా

తెలంగాణ సెర్ప్ ఐకేపీ ఉద్యోగులకు జీఓ నెంబర్ 11 ద్వారా పేస్కేల్ వర్తింపజేసినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్, రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చిత్రపటాలకు ఎంపీపీ బురుకల సుకన్య కమలాకర్‌తో కలిసి ఐకేపీ సంస్థ ఉద్యోగులు మంగళవారం పాలాభిషేకం చేశారు. అనంతరం ఏపీయం విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ గత 22 , 23 సంవత్సరాల నుంచి ఐకేపీ సంస్థలో విధులు నిర్వహిస్తు మహిళా సంఘాల అభ్యున్నతికి, వారి ఆర్థిక అభివృద్ధికి అనేక రకాలైన సేవలను అందిస్తున్నామని అన్నారు. అంతే కాకుండా ప్రభుత్వం ద్వారా ప్రవేశ పెడుతున్న మహిళలకు సంబంధించిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా ఉన్నత సేవలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి కేసీఆర్ జీవో నెంబర్ 11 ద్వారా తమకు పేస్కేల్ వర్తింపజేశారని దీనికి గాను ఐకేపీ కుటుంబ సభ్యులు జీవితాంతం ప్రభుత్వానికి రుణపడి ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బొల్లపల్లి అరుణ నవీన్‌గౌడ్, మండల సమాఖ్య కార్యాలయ సిబ్బంది, వీవోఏలు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మేకల సంత తైబజార్ వేలం పాట

నవతెలంగాణ-కోటగిరి

పొతంగల్ గ్రామ పంచాయతీలో మంగళవారం మేకల సంతకు తైబజార్ వేలంపాట నిర్వహించారు. గ్రామానికి చెందిన గంధపు గంగారం రూ.5లక్షలకు వేలంపాట దక్కించుకున్నారు. గత సంవత్సరం కన్నా లక్ష యాభై వేల రూపాయలు అధికంగా ఆదాయం వచ్చినట్లు సర్పంచ్ వర్ని శంకర్ తెలిపారు. సెక్రెటరీ యాదవ్, ఎంపీటీసీ వీరేశం, గిర్ని రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

- ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

ఐఎఫ్‌టీయూ రాష్ట్రమహాసభలను ఈనెల 25, 26, 27 తేదీల్లో మంచిర్యాల పట్టణంలో నిర్వహించనున్న నేపథ్యంలో సభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు, ఉపాధ్యక్షులు సూర్యశివాజీ కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని మామిడిపల్లిలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐఎఫ్‌టీయూ నాలుగున్నర దశాబ్దాల కాలంలో కార్మికుల సమస్యలపై పోరాడుతూ, శ్రామికులను కూడగట్టి కార్మిక రాజ్య సాధనకై ఉద్యమిస్తుందని వారు తెలిపారు. మోడీ సర్కార్ 8 సంవత్సరాల్లో, దేశ సంపదను సహజ వనరులను కార్పొరేట్ కంపెనీ అధిపతులకు కట్టబెట్టి, కార్మికుల ఉపాధిని కొల్లగొట్టిందని వారు అన్నారు. నల్ల డబ్బులు వెలికి తీసి పేదల జన్‌ధన్ ఖాతాలో రూ.15లక్షల చొప్పున జమ చేస్తానని, ఏటా రెండు కోట్ల కొలువులు ఇస్తామని, ధరలను నియంత్రిస్తామని, నిరుపేదలకు నిలువనీడ కల్పిస్తామని ఇచ్చిన హామీలను విస్మరించారని, వారు తెలిపారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను సవరణ పేరుతో నాలుగు లేబర్ కోడ్‌లుగా తెచ్చి కార్మిక వర్గానికి ఉరితాడు బిగించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం ఒకే భాష, ఒకే మతం, ఒకే ఆహారం పేరుతో భిన్న జాతుల మధ్య మత సామరస్యాన్ని దెబ్బతీస్తూ ఉద్రిక్తత పెంచుతుందని వారు అన్నారు. దళిత గిరిజన మహిళ మైనార్టీ బీసీలపై నిరంతరం దాడులు జరుగుతున్న కేంద్రం పట్టించుకోకుండా, ప్రజల్ని విభజించు పాలించు నీతితో విడగొడుతుందని వారు తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సందర్భంగా ఇచ్చిన హామీలను పక్కకు పెట్టిందని, రాష్ట్రంలో 3లక్షల మంది కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణ విషయాన్ని మర్చిపోవడం విచారకరమని వారు అన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా 76 రంగాల కార్మిక కనీస వేతనం జీవోలను సవరించి గెజిట్‌లో ప్రచురించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర, జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని దాసు, శివాజీ కార్మిక లోకానికి కోరారు. కార్యక్రమంలో నాయకులు పాషా బాయ్, ఎస్.శ్రీనివాస్, శివ, ఇన్నా, రాజారాం, పోశెట్టి, మహమ్మది, నరసమ్మ, ఖలీదా, షహదా బేగం తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

బీఆర్ఎస్ అంటే.. బీజేపీకి భయం..

- ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమా

నవతెలంగాణ-నవీపేట్

దేశంలో బీఆర్ఎస్ పార్టీ విస్తరిస్తుండడంతో బీజేపీకి భయం పట్టుకుందని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ సతీమణి ఆయేషా ఫాతిమా అన్నారు. మండల కేంద్రంలో చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరై ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ దేశంలో విస్తరిస్తుండడంతో బీజేపీకి భయం పట్టుకుందని, అందుకే ఈడీ కేసులతో ఆడపడుచు అని చూడకుండా మహిళని వేధిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ మహిళ లోకం ఎమ్మెల్సీ కవితకు మద్దతుగా ఉంటామని నినదించారు. ఆడపడుచులను తప్పుడు కేసుల పేరుతో అవమానిస్తే ఢిల్లీ పీఠం కదలడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంఘం శ్రీనివాస్, నర్సింగ్‌రావు, జెడ్పీటీసీ సవిత బుచ్చన్న, వైస్ ఎంపీపీ ఇందూర్ హరీష్, సర్పంచ్లు బత్తూరు సాయిలు, నీలేష్ కుమార్, శ్రీనివాస్, ఎంపీటీసీలు మీనా నవీన్‌రాజ్, రాధా, సతీష్, సాయిలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీమణి

స్పీకర్‌పై ఆరోపణలు సిగ్గుచేటు

నవతెలంగాణ-వర్ని/కోటగిరి

ఓటుకు నోటు దొంగ రేవంత్‌రెడ్డి అభివృద్ధి ప్రదాత స్పీకర్‌పై ఆరోపణలు చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలోని సుభాష్ చంద్రబోస్ చౌరస్తా వద్ద పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు ప్రజల సమస్యలు, రైతుల కష్టాలు 10 ఏండ్ల నుంచి కనబడలేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు కళాల్ గిరి, వెలగపూడి గోపాల్, కోఆప్షన్ కరీం, వర్ని సర్పంచ్ నాగభూషణం, మల్లారం సర్పంచ్ కన్నరం, బానోత్ ఫిరియానాయక్, హైమద్ భాయ్, బానోత్ సరి చంద్, గంగారం, గోపి, ఉప సర్పంచ్ కృష్ణ, వార్డు మెంబర్ నరేష్, బీఆర్ఎస్ సీని య ర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటగిరి : పోతంగల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్ రెడ్డి పోచారం వారి తనయులపై మాట్లాడిన తీరుపట్ల నిరసన వ్యక్తం చేస్తూ రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఏజాస్ ఖాన్ ఆధ్వర్యంలో దహనం చేశారు. సర్పంచ్ వర్ని శంకర్, నాయకులు వీరేశం, గంట్ల విటల్, నీరడి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



వర్నిలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

రవి పబ్లిక్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు

- అలరించిన చిన్నారుల నృత్యాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని సుభాష్‌నగర్‌లో గల రవి పబ్లిక్ పాఠశాలలో 38వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్, గౌరవ అతిథిగా నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. మొదట జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాటిపల్లి రవీందర్ రెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా ఎంతోమంది విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తును ఇస్తూ ముందుకు వెళ్లడం ఎంతో గర్వ కారణమని అన్నారు. 38 సంవత్సరాలుగా పాఠశాలను నడుపుతూ ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్ది ఉన్నతమైన స్థానాలలో నిలబెట్టిన ఘనత కూడా పాఠశాలకు ఉందన్నారు. కార్యక్రమంలో కాటిపల్లి రవీందర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కరస్పాండెంట్ సరళ మహేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ శ్యాం కుమార్ మాట్లాడుతూ.. తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు దిశ నిర్దేశం చేశారు. రానున్న 10వ తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థులు చాలా బాగా చదివి పాఠశాలకు అలాగే తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని సూచించారు.



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు


అలరించిన చిన్నారుల నృత్యాలు..

రవి పాఠశాల ఆవరణలో వార్షికోత్సవ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు రేణు, బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ కళ్యాణ్ చరణ్‌గౌడ్, పాఠశాల ఆధ్యాపక బృందం విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్

కొనసాగుతున్న ఆలయ వార్షికోత్సవ వేడుకలు



జగదాంబ, శ్రీ సేవాలాల్ రామారావు మహారాజ్ ఆలయం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మండలంలోని మల్కాపూర్ తండాలో 26వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 20న ప్రారంభమైన శ్రీ జగదాంబ మాత, శ్రీ సేవాలాల్ రామారావు మహారాజ్ ఆలయ వార్షికోత్సవ వేడుకలు కొనసాగుతున్నాయి. అలాగే మందిరంలో ఉగాది మహోత్సవం సందర్భంగా జాతర పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈ జాతరకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతరలో భజన కార్యక్రమాలు, అన్నదానం, ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని ప్రజలు పెద్దఎత్తున పాల్గొని వేడుకలు విజయవంతం చేయాలని కోరారు.

నేడు కల్యాపూర్, బోర్గం గ్రామాలో కుస్తీ పోటీలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కల్యాపూర్, బోర్గం గ్రామాలలో ఉగాది పండుగను పురస్కరించుకొని కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్టు గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గాన్ల నాగరాజు, లక్ష్మణ్ పేర్కొన్నారు. చివరి కుస్తీలో గెలుపొందిన మల్లయోధుడికి ఐదు తులాల వెండి కడియం ఇవ్వనున్నట్టు వారు తెలిపారు. మహారాష్ట్ర నుంచి వచ్చే మల్ల యోధులు సకాలంలో పోటీలలో పాల్గొనాలని వారు కోరారు.

వికలాంగుల రుణాలకు ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-సిరికొండ

వికలాంగుల శాఖ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వికలాంగ అభ్యర్థులకు ఈ నెల 23న మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూలు కలవని ఎంపీడీవో లక్ష్మీప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తు ప్రతులు 3సెట్లు తీసుకొని ఒరిజినల్‌తో ఉదయం 11 గంటలకు రావాలని కోరారు.

తీన్మార్ మల్లన్నపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆర్మూర్

తీన్మార్ మల్లన్నపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని తెలంగాణ జాగృతి నియోజకవర్గ అధ్యక్షులు మక్కల సాయినాథ్ అన్నారు. కవితపైన నిరాధార నిందారోపణలు చేస్తున్న తీన్మార్ మల్లన్నపై చట్టరీత్యా చర్యలు తీసుకుని ఛానెల్‌ను బ్యాన్ చేయాలని పోలీస్‌స్టేషన్‌లో స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్‌బాబుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి పట్టణ అధ్యక్షులు దండుగుల నాయుడు, జాగృతి నియోజకవర్గ యూత్ నాయకులు వరికుప్పల భూమేష్, జాగృతి యూత్ నాయకులు రాజు, జాగృతి కార్యకర్తలు దండుగుల రాజేశ్వర్, సాయికుమార్, పిరియా, రమేశ్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ మొదటి సెమిస్టరు పరీక్ష ఫీజు చెల్లింపునకు 27వరకు గడువు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అన్నీ బీఈడీ కళాశాలలకు చెందిన మొదటి సెమిస్టర్‌కు అర్హులైన విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 21తో గడువు ముగిసిందని, రూ.100 అపరాధ రుసుముతో పరీక్ష ఫీజు ఈనెల 27 వరకు విద్యార్థులు చెల్లించుకోవచ్చని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ ఎం.అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సంబంధిత తమ కళాశాలల్లో ఫీజు చెల్లించుకోవాలని ఆమె కోరారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ www.telanganauniversity.ac.inను సంప్రదించాలని ఆమె కోరారు.

ప్రతిరోజూ వ్యాయామం చేయించాలి

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని భవిత ఎడ్యుకేషన్ సెంటర్‌లో మంగళవారం వికలాంగ విద్యార్థులకు డాక్టర్ అరుణ్ ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ్ మాట్లాడుతూ దివ్యంగులైన చిన్నారులకు వారి తల్లిదండ్రులు ప్రతి రోజు ఉదయంసాయంత్రం వ్యాయామం చేయాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిసోర్స్ టీచర్ పెంటయ్య, సాయన్న, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


ఫిజియో థెరపీ నిర్వహిస్తున్న వైద్యులు

నవోదయకు విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని గండిపేట్ గ్రామానికి చెందిన సంఘం రాజు కుమారుడు సంఘం రోహిత్ నవోదయ విశ్వవిద్యాలయంలో 9వ తరగతిలో ప్రవేశం పొందినట్టు తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నవోదయ విశ్వవిద్యాలయంలో 9వ తరగతిలో మిగిలి ఉన్న బ్యాక్లాగ్ రెండు సీట్లకు పరీక్ష నిర్వహించగా ఒక సీటును గాంధారి మండలంలోని గండివేట్ గ్రామానికి చెందిన విద్యార్థి కామారెడ్డి జిల్లా బిక్నూర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న రోహిత్ పొందినట్టు తెలిపారు.


రోహిత్

20 నెలల్లో పొలాలకు నీరందిస్తాం

- బీజేపీ నాయకుల నోరు తెరిస్తే అబద్ధాలే
- కంటివెలుగు శిబిరం ప్రారంభోత్సవంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-రామారెడ్డి

రాబోయే 20 నెలల్లో రామారెడ్డి ప్రాంత పంట పొలాలకు నీళ్లు అందించబోతున్నామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మండలంలోని గొల్లపల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..... ప్రతి మారుమూల గ్రామంలో ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించి పరిష్కారం కోసం కెసిఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టారని, కంటి అద్దాలు, ఆపరేషన్లను చేపడుతున్నామని అన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి చేపట్టని సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా చేపట్టిన ఘనత కేసిఆర్ కు దక్కుతుందన్నారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంటు అందిస్తున్న రాష్ట్రం దేశంలో తెలంగాణ రాష్ట్రమని అన్నారు. మోడీ సొంత రాష్ట్రం గుజరాత్ లో రైతులు రూ, 2000 చెల్లించి విద్యుత్తును కొనుగోలు చేస్తున్నారని, అక్కడ 85 ఏండ్లు దాటిన వృద్ధులకు మాత్రమే రూ1000 మాత్రమే పింఛన్ అందజేస్తున్నారని గుర్తు చేశారు.

పుట్టబోయే బిడ్డ నుండి చనిపోయే వ్యక్తి వరకు ప్రతి ఒక్కరి సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో 65 శాతం నార్మల్ డెలివరీలు అవుతున్నాయని, రామారెడ్డి పీహెచ్సీ కింద రూ.కోటి 20 లక్షలతో ఆరు పక్క భవనాలు మంజూరయ్యాయని తెలిపారు. తెలంగాణ రాకముందు 280 ప్రభుత్వ వసతి గృహాలు ఉండేవని, తెలంగాణ వచ్చిన తర్వాత దాదాపు 1100 వసతి గృహాలను ఏర్పాటు చేసి, విద్యార్థులకు వారానికి రెండు సార్లు మాంసంతో భోజనం, ప్రతిరోజు గుడ్డు పాలు అందిస్తున్నామని అన్నారు. బిజెపి వాళ్లు నోరు విప్పితే అబద్దాలేనని, 2014లో బ్యారెల్ ముడి తమరు ధర 105 డాలర్లు ఉంటే, నేడు 65 రూపాయలు మాత్రమే ఉన్నదని, దేశంలో చమురు ధరలు ఆకాశాన్ని అంటాయని ప్రజలు గమనించాలని సూచించారు. రాజకీయలాబ్ది కోసమే బిజెపి ధర్మం కోసం అంటూ మతం, కుల రాజకీయాలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో పాల లావణ్య మల్లేష్, ఎంపీపీ దశరథ్ రెడ్డి, వైస్ ఎంపీపీ రవీందర్రావు, మండల రైతు కమిటీ అధ్యక్షులు నారాయణరెడ్డి, జిల్లా రైతుబంధు డైరెక్టర్ కాసర్ల రాజేందర్, బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు రంగు రవీందర్ గౌడ్, డిప్యూటీ డిఎంహెచ్వో చంద్రశేఖర్, వైద్యులు హరీష్ కుమార్ గౌడ్, సురేష్, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వరి కోతలు షురూ


వరిని కోస్తున్న వరి కోత యంత్రం

నవతెలంగాణ-సిరికొండ

వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా మంగళవారం నుంచి మండలంలోని కొండూరు గ్రామంలో వరి ధాన్యం కోతలు ప్రారంభించారు. ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం వడగండ్లు, వర్షం కారణంగా నేలపాలు అవుతున్నాయని, వర్ష సూచన తగ్గడంతో కోతలు ప్రారంభించినట్లు కొండూరు గ్రామస్తులు పేర్కొన్నారు.

చేపల పెంపకంపై శిక్షణ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని భూంపల్లి శివారులో గల ఈదులయ కిష్టయ్య చేపల పెంపకం వద్ద ఐకేపి ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘం మహిళలకు చేపల పెపకంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. మంగళవారం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రమేష్ బాబు ఆరోవరోజు చేపల పెంపకంపై పలు సూచనలు చేశారు. చేపలు పెంచడం వలన లాభాలను వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం రాజిరెడ్డి మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పలువురికి సన్మానం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని చండేగాం గ్రామంలో సర్పంచ్ షిండే అనితా వెంకట్ రావ్ పటేల్ అధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో పండరిపూరం విఠలేశ్వర మందిరానికి చెందిన ప్రముఖులతో పారాయణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని దైవ చింతనలో యువత సన్మార్గంలో నడుచుకోవాలని, దురలవాట్లకు దూరంగా ఉంటు సన్మార్గంలో పయనించి తల్లిదండ్రుల గౌరవం కాపాడాలని వారు సూచించారు. ముగింపు రోజు మహాఅన్నదానం నిర్వహించారు. అథితులకు గ్రామపెద్దలు సన్మానం చేపట్టారు. నాయకులు వెంకట్ రావ్ పటేల్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న దృశ్యం

స్కూళ్లల్లో ఉగాది సంబరాలు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలం లోని ఆయా పాఠశాలలో మంగళవారం ముందస్తుగానే ఉగాది సంబరాలను నిర్వహించారు. మండలంలోని శెట్టిపల్లి సంగారెడ్డి ప్రాథమిక పాఠశాల. ప్రాథమికోన్నత పాఠశాల సజ్జన్ పల్లి జల్దిపల్లి నల్లమడుగు, కన్నాపూర్, భవానిపేట్ తో పాటు ఆయా పాఠశాలలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. సజ్జనపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదర్ సిద్ధాంతి వేషధారణలో అలరించారు. శెట్టిపల్లి సంగారెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల్‌రెడ్డి విద్యార్థులకు ఉగాది పచ్చడిని అందించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు బస్సీ, పద్మ, కవిత, జాకిర్, సంగమేశ్వర్ విద్యార్థులు పాల్గొన్నారు.


సిద్ధాంతి వేషధారణలో సజ్జనపల్లి హెచ్ఎం

ఇంటి పన్ను చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలి

నవతెలంగాణ-పిట్లం

ఇంటి పన్ను చెల్లించి పంచాయతీకి సహకరించాలని సెక్రెటరీ యాదగిరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఇంటింటా పన్ను వసూలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మార్చి నెల చివరి వరకు 100 శాతం ఇంటి బిల్లులు , తదితర షాపుల బిల్లులను వసూల్ చేపట్టేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మనోజ్ , అంకం శ్రీను , చెవుల శ్రీను , కొండ బసంత్ తదితరులు పాల్గొన్నారు.

శుభాలు చేకూరాలి

- ఉగాది శుభాకాంక్షలు తెలిపిన పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్ సిటీ

శ్రీ శోభకృత్ నామ సంవత్సరంలో జిల్లా ప్రజలందరికీ శుభాలు చేకూరాలని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆకాంక్షించారు. ఉగాది పర్వదినం పురస్కరించుకొని ఉమ్మడి జిల్లా ప్రజలకు స్పీకర్ పోచారం, మంత్రి వేముల, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ నాగరాజు మంగళవారం శుభాకాంక్షలు తెలియజేశారు. ఉగాది పండగను ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. మంత్రి వేముల మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం బంగారు తెలంగాణగా రూపుదిద్దుకుంటోందని, ఇప్పటికే సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల అమలులో యావత్ దేశానికి తెలంగాణ మార్గదర్శంగా నిలుస్తోందని అన్నారు. దినదినాభివృద్ధి సాధిస్తూ, దేశంలో అగ్రగామిగా వెలుగొందుతున్న తెలంగాణ రాష్ట్రం ప్రస్తుత శ్రీ శోభకృత్ నామ సంవత్సరం లో మరింత ప్రగతి సాధించాలని, అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలు, ఆనందోత్సాహాలతో ఉండాలని ఆకాంక్షించారు.

గన్నారంలో ఉగాది ఉత్సవాలు షురూ



నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని గన్నారం గ్రామంలో ఉగాది ఉత్సవాలు మంగళవారం నుంచిషురూ అయ్యాయి. గ్రామంలోని పురాతన దేవాలయమైన శ్రీశ్రీ లొద్దుల రామాస్వామి గుడి అటవీ ప్రాంతంలో ఉండడంతో ఆ దేవాలయానికి ఎద్దుల బండ్లు, కొబ్బరిబోండాలు తీసుకువెళ్లరు. రాత్రి గుడి వద్దే భజన కార్యక్రమాలు చేపట్టారు. రాత్రి అక్కడనే నిద్ర చేసి ఉదయం మళ్ళీ గ్రామానికి తిరిగి ఎద్దుల బండ్లతో గ్రామ యువకులు అందరూ ఉదయం లేవగానే తిరిగి గ్రామానికి బయలుదేరుతారని గ్రామస్తులు తెలిపారు. నేడు సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో గ్రామంలోని ఉన్న గ్రామ దేవతల చుట్టూ ఎద్దుల బండ్లతో ఊరేగింపుగా బయలుదేరి ప్రతి గ్రామ దేవత వద్ద కొబ్బరికాయలు కొడుతూ భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారని వివరించారు.

తక్షణమే డబ్బులు చెల్లించాలి

నవతెలంగాణ-మోర్తాడ్

ప్రజల డబ్బులు కాజేసిన ఏర్గట్ల మండలం తోర్తి గ్రామానికి చెందిన పోస్టుమాస్టర్ సాయన్నపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు మోర్తాడ్ మండల కేంద్రంలోని జాతీయ రహదారి 63పై రాస్తారోకో మంగళవారం నిర్వహించారు. పోస్టుమాస్టర్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు విచారణ జరిపి నెలలు గడుస్తున్నా లబ్ధిదారులకు న్యాయం చేకూర్చలేదని, లబ్దిదారులకు డబ్బులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని పలువురు లబ్ధిదారులు పోస్ట్ ఆఫీసులో సుకన్య సమృద్ధి యోజన తోబాటు రికరింగ్ డిపాజిట్లు చేసిన వారి డబ్బులను కాజేసినా అధికారులు ఇప్పటికీ ఆయనపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే బీపీఎంపై చర్యలు తీసుకొని తాము డిపాజిట్ చేసిన డబ్బులను రికవరీ చేయించి తమకు న్యాయం చేయాలని కోరారు.


రాస్తారోకో చేపట్టిన ఏర్గట్ల మండలం తుర్తి గ్రామస్తులు

26న మహారాష్ట్రలో సీఎం సభ

- జయప్రదం చేయండి : బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఆశన్న గారి జీవన్‌రెడ్డి ప్రచారం


కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

ఈ నెల 26వ తేదీన మహారాష్ట్రలోని కందార్ లోహలో జరిగే ముఖ్యమంత్రి కేసీఆర్ భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పీయూసీ చైర్మన్ బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు స్థానిక ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి కోరారు. మంగళవారం అక్కడ సభా స్థలి ఏర్పాట్లను పరిశీలించారు. అబ్‌కి బార్ కిసాన్ సర్కార్ నినాదంతో తెలంగాణ మెడల్ కరపత్రాలను స్థానికులకు పంచుతూ 26 వ తేదీ న జరిగే సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని అహ్వానించినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్ రెడ్డి ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనలో ఉత్తమ జిల్లాగా నిజామాబాద్

- రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా క్షయ నియంత్రణ విభాగం ద్వారా జిల్లాలో విస్తృతంగా క్షయ నిర్మూలన కార్యక్రమాల్ని నిర్వహించి టీబీని , నూతన క్షయ వ్యాధిగ్రస్తులను 60 శాతం వరకు నిర్మూలించడం ద్వారా నిజామాబాద్ జిల్లాకి రాష్ట్రస్థాయిలో మూడు అవార్డులు వరించాయి. అందులో మొదటిది నిజామాబాద్ జిల్లా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ జిల్లాగా ఎంపిక కావడం గర్వకారణం. రెండవది జిల్లా క్షయ నియంత్రణ అధికారి డి టి సి ఓ రాష్ట్రస్థాయిలో ఉత్తమ డిటిసి ఓ గా డాక్టర్ ఎం సుదర్శనం ఎంపిక కావడం. మూడోది జిల్లా క్షయ నియంత్రణ సమన్వయకర్తగా రవి గౌడ్ ఎంపిక కావడంతో జిల్లాకు రాష్ట్రస్థాయిలో మూడు అవార్డులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఈ అవార్డులని ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని హైదరాబాద్‌లో భారత కేంద్ర ప్రభుత్వ క్షయ నియంత్రణ రీజనల్ డైరెక్టర్ అనురాధ మెరుదు, క్షయ నియంత్రణ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం చేతులమీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ డిటిసిఓగా ఎంపికైన డాక్టర్ ఎం సుదర్శనం డిఎంహెచ్ఓ నిజాంబాద్ మాట్లాడుతూ.. జిల్లాను క్షయ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో నిజామాబాద్ జిల్లాలో ఎటువంటి నూతన కేసులు నమోదు కాకుండా క్షయ రహిత జిల్లాగా మారుస్తామని తెలిపారు. ఇందులో భాగస్వాము లైనట్టి క్షయ నియంత్రణ విభాగ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు మరియు ప్రజా ప్రతినిధులు జిల్లా ప్రజలందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో జాతీయస్థాయిలో నిజామాబాద్ జిల్లాను ప్రథమంగా నిలపడానికి శాయ శక్తుల కృషి చేస్తామని తెలిపారు.



మెమొంటో అందజేత

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని నల్లమడుగు పెద్ద తండాలో మంగళవారం టెంకాయ కొట్టి సిసి రోడ్డు పనులను ప్రారంభించినట్టు తండా సర్పంచ్ రవీందర్ నాయక్ తెలిపారు. వర్షాకాలం వస్తే తండాలో కాలినడకన నడవాలంటే కష్టతరంగా ఉండేదన్నారు. సిసి రోడ్ మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు ఎమ్మెల్యే జాజాల సురేందర్ దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించారు. సిసి రోడ్ నిర్మాణానికి 10 లక్షల రూపాయల మంజూరు చేశారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం మంగళవారం సిసి రోడ్డు పనులకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. ఎన్నో సంవత్సరాల కల నెరవేరిందని తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సురేందర్, టీఆర్ఎస్ నాయకులు ఈశ్వర్, రవి, మాన్సింగ్, చందర్, తాండవాసులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లతో గ్రామంలో కళ

నవతెలంగాణ-జుక్కల్

సీసీ రోడ్లతో గ్రామంలో కళ వస్తుందని లొంగన్ సర్పంచ్ నాగలగిద్దే ఉషారాణి సదుపటేల్ అన్నారు. మంగళవారం గ్రామంలోని ఎస్సీ కాలనీ నుంచి బీసీ కాలనీ వరకు ఉపాధిహామీలో భాగంగా రూ.ఐదు లక్షల వ్యయంతో రోడ్డు పనులను మండల స్థాయి ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సదుపటల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులు ప్రారంభం

శెట్పల్లి పాఠశాలలో విజయస్ఫూర్తి

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని శెట్పల్లి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు విజయస్ఫూర్తి కార్యక్రమాన్ని హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిదులు రజనీకాంత్ గౌడ్, రామానుజ చారి, సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు వెళ్లాలని భయం లేకుండా ఆత్మవిశ్వాసంతో పదవ తరగతి పరీక్షలు రాసి విజయతీరాలకు చేరాలని, ప్రతి విద్యార్థి మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకుని రావాలని తెలిపారు. అదే విధంగా పట్టుదలతో పై చదువులు చదివి ఉన్నత స్థాయికి చేరాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఎండ్రియాల్ గ్రామానికి చెందిన రాజేశ్వరరెడ్డి ఆర్థిక సహాయంతో 25 మంది విద్యార్థులకు సంస్థ తరుపున పరీక్ష ప్యాడ్‌లను, పెన్నులను వితరణ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయన్న, ఉపాధ్యాయులు శ్రీనివాసులు శర్మ సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పరీక్ష అట్టలు పెన్నులు అందజేత

విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ

నవతెలంగాణ-రాజంపేట్

మండలం లోని కొండాపూర్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను, పెన్నులు, స్కేల్‌లను రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు సిరిగదా శంకర్, కొండాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి నర్సింలు (తాడ్వాయి మండల సీఆర్‌పీ) కలిసి విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని వారు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వాతి భాస్కర్, జడ్పీటీసీ కొండా హనుమాండ్లు, రాజంపేట్ తహసీల్దార్ శాంత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నళిని, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.


పరీక్ష అట్టలు పంపిణీ

స్పీకర్‌కు క్షమాపణలు చెప్పాలి

- రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఉన్నత స్థానంలో ఉన్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిపై చేసిన ప్రసంగాన్ని సుమోటోగా తీసుకుని పీడీ యాక్ట్ నమోదు చేసి ఎంపీ పదవుల నుండి బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. స్పీకర్‌కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బాన్సువాడ, నసరుల్లాబాద్, బీర్కూర్ మండలాల్లో మంగళవారం దహనం చేశారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఉద్దేశించి అసభ్యంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బిఆర్ఎస్ నేతలు తెలిపారు. పాదయాత్రలు ఎవరైనా చేసుకోవచ్చు తప్పులేదు కానీ అసత్య ప్రచారాలతో అబద్ధపు మాటలతో గౌరవ బిఆర్ఎస్ నాయకులను, పార్టీపై చౌకబారు విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. మాటతీరు మార్చుకోకపోతే కాలంచెల్లిన పార్టీకి, క్రమ శిక్షణ లేని పార్టీకి బాన్సువాడ నియోజకవర్గ ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ప్రభకర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ లు శ్రీనివాస్ యాదవ్, గంగారాం, సీనియర్ నేతలు శ్యామల, మల్లేష్, ప్రతాప్, మైషగౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, కలీల్, పలు గ్రామ సర్పంచ్ లు ఎంపిటిసి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

పనులు త్వరగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండలంలోని అంబర్ పేట గ్రామం లోని మన ఊరు మన బడిలో చేపడుతున్న పనులను జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్ మంగళవారం పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వవిప్ గంపగోవర్ధన్ చొరవతో రూ.88 లక్షలతో నిర్మిస్తున్న మోడల్ బిల్డింగ్ నిర్మాణ విధానం పరిశీలించి నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సలీమ్, మండలం వైస్ ఎంపీపీ పుట్ట, బాపురెడ్డి, ఎంపీటీసీ రాజేశ్వర్, మండల కో.ఆ. మెంబర్ షెమ్మి బాయ్, పంచాయతీరాజ్ ఏఈ సురేందర్ రెడ్డి, ఏవో పవన్ కుమార్, ఉపాధ్యాయులు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్‌లో చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-వర్ని

మండలంలోని జాకోరా గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్దిదారులకు ఐదో విడతలో రూ.74లక్షల 38,741 విలువ గల చెక్కులను పార్టీ ప్రజాప్రతినిధులు మంగళవారం పంపిణీ చేశారు. బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయించినందుకు 60 డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారులు హర్షం వ్యక్తం చేస్తూ స్పీకర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగపూడి గోపాల్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కలాల గిరి, సర్పంచి గోదావరి గణేష్, ఎంపీటీసీ ఎండుగుల సాయిలు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కేంద్రం సాయిలు, నాయకులు గడ్డెల హనుమాన్లు, సంజీవ్, ఉప సర్పంచ్ దత్తు, రంజాన్, లక్ష్మణ్, టోపీ సాయిలు, ఎర్సపల్లి దత్తు గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్ మార్పుకు కలెక్టర్ హామీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎంప్లాయిస్, పెన్షనర్ల, జర్నలిస్టుల వెల్‌నెస్ సెంటర్‌ను ప్రస్తుతమున్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి వెంటనే మార్చేందుకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు హామీనిచ్చారు. ఆ మేరకు మంగళవారం తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్‌తో జరిగిన చర్చల సందర్భంగా కలెక్టర్ ఆ మేరకు వెల్‌నెస్ సెంటర్ అండ్ ఆరోగ్యశ్రీ సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ప్రస్తుతం మెప్మా బిల్డింగ్, ఖాళీగా ఉన్న ఇతర ప్రభుత్వ భవనాలను కూడ పరిశీలించి అన్ని వసతులతో కూడిన భవనంలోనికి మార్చేందుకు ప్రతిపాదనలు వెంటనే పంపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు రామ్మోహన్‌రావు, జిల్లా నాయకులు జార్జ్, ఎస్.ప్రసాదరావు, చార్లెస్, ప్రభుదాస్, ఫారెస్ట్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

'జనచైతన్యయాత్ర'ను విజయవంతం చేయాలి

- **సీపీఐ(ఎం) పార్టీ బోధన్ ఏరియా కార్యదర్శి ఏశాల గంగాధర్**

నవతెలంగాణ-బోధన్

సీపీఐ(ఎం) అఖిల భారత కమిటీ పిలుపులో భాగంగా తెలంగాణ రాష్ట్ర కమిటీ తరపున మార్చి 17 నుంచి 29 వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 3 జాతాలు నిర్వహిస్తున్నారని, కావున ఈ కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం సాలూర మండలంలోని కుమ్మన్‌పల్లి గ్రామంలో సీపీఐ(ఎం) పార్టీ బోధన్ ఏరియా కార్యదర్శి ఏశాల గంగాధర్ బీడీ కార్మికుల వద్ద కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 24వ తేదిన 3వ జాత కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని పాత కలెక్టర్ ఆఫీస్ వద్ద బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. అనంతరం నిజామాబాద్ నుంచి కామారెడ్డికి బైక్ ర్యాలీ ద్వారా యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు.


కరపత్రాలు పంచుతున్న ఏశాల గంగాధర్

కార్యక్రమానికి సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు విజయ రాఘవన్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, తీగల సాగర్, చుక్కా రాములు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు రమ హాజరవుతున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ కార్మికులు, కూలీలు, రైతులు, బీడీ కార్మికులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పేద ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం 2014-19 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, మతోన్మాద కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా సంక్షేమం మతసామరస్యం ప్రజాస్వామ్యం సామాజిక న్యాయం కోసం జరుగుతున్న ప్రజలు ప్రజాసామికవాదులు లౌకికవాదులు మేధావులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. బీడీ కార్మికులకు జీవన భృతితో పాటు కూలీలు పెంచాలని, ఇంటి స్థలంలేని వారికి ఇంటి స్థలం ఇవ్వాలని, ఇల్లు లేని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని తదితర సమస్యల పరిష్కారం కోసం జరిగే పోరాటంలో ప్రజలందరూ భాగ్యస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోనే సతీష్, నాగలక్ష్మి, సావిత్రి, మొన్నే స్వప్న, గోదావరి, పూర్వాసన అంజలి, తమబ్బ స్వామి తదితరులు పాల్గొన్నారు.

మనస్థాపంతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

- **ఆత్మహత్యకు కారణమైన కుళాయి నీటి వివాదం**

నవతెలంగాణ-బోధన్



సాలూర మండల కేంద్రానికి చెందిన ఇంటర్ విద్యార్థిని వైష్ణవి(19) తనపై తన పొరుగువారు గొడవపడి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో భయపడి ఆమె మనస్థాపానికి గురై మంగళవారం వేకువజామున తన ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని మృతి చెందినట్టు బోధన్ రూరల్ ఎస్ఐ సందీప్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఇంటి వద్ద తన తల్లి లక్ష్మీతో కలిసి కుళాయి నీళ్ల పట్టుకునే విషయంలో కారడి శోభ అనే మహిళతో ఇరువురి మధ్య వివాదం జరిగింది. దాంతో కారడి శోభ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలిసిన వైష్ణవి భయపడి మనస్థాపానికి గురయి వేకువజామున తన ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయింది. ఇంటర్ చదువుతున్న, చేతికొచ్చిన కూతురు తమ కండ్ల ముందే గొడవతో ఆత్మహత్య చేసుకుని మృతి చెందడంతో తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. కూతురి మృతితో వారు రోధిస్తున్నారు. తనతో గోడవపడిన కారడి శోభ, సురేష్ అనే వాళ్లు తన చావుకు కారణమని పేర్కొంటూ వైష్ణవి ఆత్మహత్య లేఖను రాసినట్టు బోధన్ రూరల్ ఎస్ఐ సందీప్ తెలిపారు. మృతురాలి తండ్రి టెంకల రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సందీప్ తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఐదవ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వృద్ధుడు అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు ఐదవ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సాయినాథ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. నిజామాబాద్ ఐదవ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖిల్లా రోడ్ వద్ద ఈనెల 18వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి సుమారు (60) సంవత్సరాలు అనారోగ్యంతో పడిపోయి ఉన్నాడు. స్థానికుల సమాచారంతో అతనిని 108 అంబులెన్స్‌లో గవర్నమెంట్ హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం పంపగా మంగళవారం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఈ వ్యక్తికి సంబంధించిన వివరాలు ఎవరికైనా తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, లేదా 87126 59727, 8712659844 నెంబర్లకు సమాచారం అందించాలని తెలియజేశారు.

అర్ధరాత్రి ముగ్గురు దొంగల దాడి

- **సెల్‌ఫోన్, నగదు చోరీ**

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రం నుంచి సోమవారం అర్ధరాత్రి కమలాపూర్ వెళ్తున్న పాలెం నరేష్‌పై ముగ్గురు ద్విచక్ర వాహనంపై వచ్చి దాడి చేసి ఒక సెల్ ఫోను, రూ.1000 నగదును అపహరించినట్టు ఎస్సై రాజారెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కమలాపూర్ గ్రామానికి చెందిన పాలెం నరేష్ వృత్తిరీత్యా హార్వెస్టర్ డ్రైవర్ కావడంతో మహారాష్ట్ర నాగ్ పూర్ నుండి ఇంటికి తిరుగు ప్రయాణంలో అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత నవీపేట్ కి వచ్చి నడుచుకుంటూ వెళ్తుండగా పాత యూనియన్ బ్యాంక్ ముందు ముగ్గురు యాక్టివా వాహనంపై వచ్చి ఫోన్ డబ్బులు ఇవ్వాలని బెదిరించి చేతులతో దాడి చేసి ఒక ఫోన్, రూ.1000 తీసుకొని పారిపోయారు. బాధితుడు మంగళవారం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాజిరెడ్డి తెలిపారు.

లిఫ్టు కాలువలో పడి ఒకరి మృతి

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని నాళేశ్వర్ శ్రీ రాజరాజేశ్వర లిఫ్టు కాలువలో పడి తోట లక్ష్మణ్ (38) మృతి చెందినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం మండలంలోని నాళేశ్వర్ గ్రామానికి చెందిన తోట లక్ష్మణ్ సోమవారం మధ్యాహ్నం తన కౌలు పొలానికి వెళ్లి తిరిగి రాకపోవడంతో మంగళవారం ఉదయం పొలం వద్ద యాక్టివా స్కూటీ కనిపించగా చుట్టుపక్కల వెతకడంతో లిఫ్టు కాలువలో మృతి చెంది ఉన్నాడని అతని భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరం

- **ఎమ్మెల్సీ వీ గంగాధర్‌గౌడ్**

నవతెలంగాణ-డిచ్‌పల్లి


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ

ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదని ఎమ్మెల్సీ వి.గంగాధర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని మిట్టపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఇద్దరికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ ప్రధాన కార్యదర్శి ఓడ్డం నర్సయ్య, సర్పంచ్ తెలు గణేష్, ఎంపీటీసీ బాల గంగాధర్, కిషన్, తిరుపతి, పి.రవి, రమేష్, గంగాధర్, రాజు, రాజకుమారి, ప్రమోద్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన సిబ్బంది

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్


మొక్కలు నాటుతున్న పలువురు

అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా సారంగపూర్ అర్బన్ పార్క్‌లో తెలంగాణ యూనివర్సిటీ బీఈడీ కళాశాల అధ్యాపకులు, అటవీ శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డాక్టర్ మహేందర్ మాట్లాడుతూ.. చెట్లు పర్యావరణాన్ని పరిరక్షిస్తాయని అన్నారు. దేశంలో అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు మొక్కలను విరివిగా నాటాలని సూచించారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, సువర్చల, హరిత, నవీన, ఇతర అధ్యాపకులు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మాందాపూర్ గ్రామంలో లక్నపూర్ గ్రామంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ.. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.పది లక్షల నిధులను మంజూరు చేసిన ఎంపీపీ మస్తా ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి సర్పంచ్ మీర్జా కలీం బేగ్ పదో తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులను మంగళవారం పంపిణీ చేశారు. విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, విద్యార్థి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆయన సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దేవోల్ల యోగేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు మోసిన్ బేగ్, గౌస్, గ్రామ కార్యదర్శి నవీన్, కారోబార్ సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

టీయూకి సిల్వర్ మెడల్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ కిక్ బాక్సింగ్ ఉమెన్ ఛాంపియన్ షిప్ 2022-23లో ఈనెల 20 నుంచి 22 వరకు వీరు బహదూర్ సింగ్ పూర్వాంచల్ యూనివర్సిటీ జాన్‌పూర్, ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న టోర్నమెంట్లో తెలంగాణ యూనివర్సిటీ కిక్ బాక్సింగ్ (ఉమెన్) మహిళ పి.ఉమా సిల్వర్ మెడల్ సాధించిందని యూనివర్సిటీ క్రీడా విభాగం డైరెక్టర్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డాక్టర్ టి.సంపత్ మంగళవారం తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీకి ఇది తొలి పతకమని, ఈ పతకం సాధించిన క్రీడాకారిణి ఉమా, కోచ్ శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు.

హసాకొత్తూర్ విద్యార్థినికి డాక్టరేట్ డిగ్రీ ప్రదానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హసా కొత్తూరు గ్రామానికి చెందిన విద్యార్థిని రాధారపు రాజకళకు డాక్టరేట్ డిగ్రీ లభించింది. మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ వృక్షశాస్త్ర విభాగంలో జరిగిన వైవా-వోక్ కార్యక్రమంలో రాధారపు రాజకళకు డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేశారు. డా.ఎ.ఎ. హలీం ఖాన్ పర్యవేక్షణలో రాజకళ "ఎఫెక్ట్ ఆఫ్ బ్రాసినోస్టీరాయిడ్స్ ఆన్ గ్రోత్ అండ్ మెటా బోలిసం ఆఫ్ సోలానం నైగ్రమ్ ఎల్. ఇన్ సెమి-అరిడ్ ట్రోపిక్స్ ఆఫ్ నిజామాబాద్" అనే అంశం పై పరిశోధనలు చేశారు. తన పరిశోధక గ్రంథాన్ని తెలంగాణ యూనివర్సిటీకి సమర్పించారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, హైదరాబాద్‌కి చెందిన ఆచార్య షేక్ మక్బుల్ అహ్మద్ ఎక్స్టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. కాగా రాజకళ తన పరిశోధనలో సోలానం నైగ్రంపై బ్రాసినోస్టీరోయిడ్స్ వలన ఔషధ విలువలు పెంచవచ్చని నిరూపించారు. రాజకళ పరిశోధన ఫలితాలపై సంతృప్తి చెంది డాక్టరేట్ అవార్డును ప్రకటించారు. డాక్టరేట్ డిగ్రీ సాధించిన రాజకళని తెలంగాణ యూనివర్సిటీ వీసీ ఆచార్య రవీందర్, రైజిస్ట్రార్ ఆచార్య బి.విద్యావర్ధిని అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ సైన్స్ డీన్, ప్రిన్సిపాల్ ఆచార్య సి.హెచ్.ఆరతి, వృక్షశాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎమ్.అరుణ, డాక్టర్ ఎ.ఎ. హలీమ్ ఖాన్, డాక్టర్ దేవరాజు శ్రీనివాస్, డాక్టర్ వి.జలంధర్, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఈఈగా ఆర్.శంకర్ ఉద్యోగ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఆర్మూర్


బాధ్యతలు స్వీకరిస్తున్న ఈఈ

పంచాయతీరాజ్ ఈఈగా ఆర్.శంకర్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఇంజనీర్లు ఇంద్రసేన్‌రెడ్డి, రాజేశ్వర్, మహేందర్, ఏఈలు నిలీష్, విక్రమ్, బాలాజీ, సీనియర్ అసిస్టెంట్లు రామారావు, మంచిర్యాల సురేఖ, నాగేష్ శర్మ, యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

కవిత్వమే సమాజానికి వసంత హేతువు

- **ఘనంగా శ్రీ శోభకృత్ ఉగాదికి స్వాగతం**

నవతెలంగాణ-కంఠేశ్వర్

కవిత్వమే సమాజానికి వసంత హేతువు అని ప్రముఖ కవి సభా సామ్రాట్ విపి చందన్ రావు అన్నారు. శ్రీ శోభకృత్ నామ ఉగాది వేడుకలు, 26వ ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని కేర్ డిగ్రీ కళాశాలలో 'వసంతాన్ని పిలుద్దాం రా' శీర్షికన కవి సమ్మేళనం ఘనంగా జరిగింది. తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ కవి, సభా సామ్రాట్ విపి చందన్‌రావు మాట్లాడుతూ.. ఉగాది ఆగమనంతో చెట్లకు వచ్చిన పచ్చదనం మనిషి జీవితాల్లో ఆనందమై సంతృప్తి రావాలని ఆకాంక్షించారు.


కవి సమ్మేళనంలో పాల్గొన్న పలువురు కవులు

కవిత్వం సమాజానికి వెలుగు రేఖగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా చేసిన ప్రముఖ కవి పంచరెడ్డి లక్ష్మణ మాట్లాడుతూ.. కవిత్వం, వసంతం మనిషి జీవితంలో ఉచ్వాస నిశ్వాసలుగా ఉన్నాయని ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు మాట్లాడుతూ.. మహిళలకు కవిత్వం సాహిత్యం ఆధునిక ఆయుధాలుగా పరిణమించాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఘనపురం దేవేందర్ మాట్లాడుతూ కవిత్వం వ్యక్తిత్వం ఒకే విధంగా ఉన్న కలం యోధులు సమాజానికి చైతన్య దీపికలవుతారు అని అన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు నరాల సుధాకర్, గుత్ప ప్రసాద్, కాసర్ల నరేష్, గంట్యాల ప్రసాద్, పద్మావతి, శంకర్ సింగ్, రమాశకుంతల, రమణాచారి, శ్రీరామ లక్ష్మణ్, గోపాల్, నాగరాజు, ఎలగందుల లింబాద్రి, దారం గంగాధర్, తిరుమల శ్రీనివాస్ ఆర్య, శంకర్, సాయిబాబు తదితరులు కవితా గానం చేశారు. ఈ సందర్భంగా కవులకు ఉగాది పురస్కారాలతో సత్కరించారు.

నర్సింగ్ కళాశాలలో 'ఓత్ కార్యక్రమం'


మాక్లూర్ : ఓత్ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీచైర్మెన్

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని నర్సింగ్ కళాశాలలో 2022-23 బ్యాచ్ జీఎన్ఎం నర్సింగ్ విద్యార్థినుల ఓత్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జెడ్పీ చైర్మెన్ దాదన్నగారి విఠల్‌రావు మాట్లాడారు. భవిష్యత్తులో ప్రజలకు తమ వంతు సేవ అందించాలని కోరారు. అంతకుముందుగా మండలంలోని వెంకటపూర్ గ్రామంలో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాస్త ప్రభాకర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.ప్రతిమరాజ్, ఎంపీడీఓ క్రాంతి, మెడికల్ ఆఫీసర్ సరిత, ఐకేపీ ఏపీఎం అనిల్‌కుమార్, ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు, మండల కోప్షన్ అహ్మద్, ఉప సర్పంచ్ లక్ష్మీ సాయిలు, బీఆర్ఎస్ నాయకులు అంజయ్య, విఠల్‌రావు, మహిళా సంఘం అధ్యక్షులు శాంత, పద్మావతి పాల్గొన్నారు.

మోటార్ రివైండింగ్ మెకానిక్‌ల కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మోటార్ రివైండింగ్ మెకానిక్‌ల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మోటార్ రివైండింగ్ మెకానిక్‌ల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నవీన్ (కమ్మర్‌పల్లి), ఉపాధ్యక్షులుగా కప్పదండి అశోక్ (నాగపూర్), ఎంఏ మసీద్ (చౌట్‌పల్లి), ప్రధాన కార్యదర్శిగా దయాకర్ (హసాకొత్తూర్), సహాయ కార్యదర్శిగా దుబ్బప్ప (కమ్మర్‌పల్లి), కోశాధికారిగా సత్యపాల్ (కమ్మర్‌పల్లి), మండల కమిటీ సహాయకులుగా గంగాధర్ (కమ్మర్‌పల్లి), శ్రీనివాస్ (ఉప్లూర్), గంగాధర్ (కోనాసముందర్) ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన మండల కమిటీ కార్యవర్గ సభ్యులను జిల్లా అధ్యక్షులు రాజా కిషన్ అభినందించారు. నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలు పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ అలీ, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరి స్వామి, జిల్లా కోఆర్డినేటర్ ఓంకార్, ముప్కాల్ మండల అధ్యక్షుడు శంకర్, మెండోరా మండల అధ్యక్షుడు సంతోష్, భీంగల్ మండల ఉపాధ్యక్షుడు మహమ్మద్ నవీద్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవిద్య సాయి హైస్కూల్‌లో ఉగాది సంబురాలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో ఉగాది పర్వదినం సందర్భంగా స్థానిక శ్రీ విద్యా సాయి ఉన్నత పాఠశాలలో ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ పద్ధతిలో దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఉగాది పచ్చడి పంపిణీ చేసి, ఉగాది పండగ విశిష్ఠతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. అనంతరం ఈ వేడుకల్లో మంచి ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

తపాలా శాఖ ఆధ్వర్యంలో పథకాలపై అవగాహన

నవతెలంగాణ-ముప్కాల్

పోస్టాఫీసు పథకాలలో భాగంగా మంగళవారం 'పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్'పై ముప్కాల్ మండల కేంద్రంలో గ్రామస్తులకు అవగాహన కల్పించినట్టు పోస్టల్ మేల్ ఓవర్సీర్ యం.వో వంశీ తెలిపారు. ఈ సందర్భంగా దాదాపు మండల కేంద్రంలో 20మందికి 'పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్' సౌకర్యం కల్పించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ముప్కాల్ పోస్టల్ అధికారిణి సుష్మా, పోస్ట్‌మేన్ సాగర్, రెంజర్ల పోస్ట్‌మేన్ సత్యనారాయణ, నాగంపేట్ పోస్ట్‌మేన్ శ్రీనివాస్, పోస్టల్ సిబ్బంది, పోస్టల్ ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయం

నవతెలంగాణ-ఆర్మూర్

కాలనీ అభివృద్ధిలో కౌన్సిలర్ ఇట్టెడి నర్సారెడ్డి కృషి చేయడం అభినందనీయమని ఏడో వార్డు తిరుమల కాలనీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు నరేందర్‌గౌడ్, దామోదర్ గౌడ్ అన్నారు. మంగళవారం కౌన్సిలర్ నర్సారెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయనను పూలమాల శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ రాజేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పండిత్ వినీత పవన్ సహాయ సహకారాలతో కాలనీ అభివృద్ధిలో కృషి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షులు బొమ్మన శంకర్, కత్రాజీ శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.


కౌన్సిలర్‌ను సన్మానిస్తున్న పలువురు

రాత్రి బస్సు రద్దు


గాంధారి బస్టాండ్

- ఇబ్బందులు పడుతున్న గాంధారి, సదాశివనగర్ ప్రయాణీకులు

నవతెలంగాణ-గాంధారి

కామారెడ్డి జిల్లా కేంద్రం నుంచి గాంధారి మండల కేంద్రానికి గత 30 సంవత్సరాలుగా నైట్ హాల్ట్ బస్సు సౌకర్యం ఉండేది. మండల ప్రజలు దూర ప్రాంతాలు వెళ్లి గాంధారికి వచ్చేందుకు బస్సు సౌకర్యం కామారెడ్డి నుంచి బాన్సువాడ వయా గాంధారికి ఉండేది. రాత్రి 9:30 గంటలకు కామారెడ్డి నుంచి వయా సదాశివనగర్, గాంధారి మీదుగా బాన్సువాడ వరకు బస్సు సౌకర్యం ఉండటంతో ఇక్కడి వారికి సౌకర్యంగా ఉండేది. వివిధ పనుల నిమిత్తం దూర ప్రాంతాలైన హైదరాబాద్, వేములవాడ, కరీంనగర్ వెళ్లిన ప్రజలకు గాంధారి బాన్సువాడ చేరుకునేందుకు బస్సు సౌకర్యవంతంగా ఉండేది. గత రెండు సంవత్సరాలుగా ఆర్టీసీ వారు నైట్ అల్ట్ బస్సును బంద్ చేయడంతో మండలంలోని ప్రజలు దూర ప్రాంతాలు వెళ్లి గాంధారి చేరుకోవడానికి నాన అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలకు అధిక డబ్బులు చెల్లించి రాత్రి సమయంలో ఇంటికి చేరుకుంటున్నారు. పేద ప్రజలు చేసేదేమీ లేక కామారెడ్డి బస్టాండ్లనో లేక తెలిసిన వారి దగ్గర రాత్రి ఉండి మర్నాడు ఉదయం గాంధారి చేరుకుంటున్నారు.

ప్రయాణీకులు అవస్థలు పడుతున్నా ఇటు ప్రజాప్రతినిధులు గాని ఆర్టీసీ అధికారులు గానీ పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ప్రజల కష్టాలు తీరుస్తామని గొప్పలు చెబుతున్న పాలకులు గత రెండు సంవత్సరాలుగా నైట్ హాల్ట్ బస్సు లేక మండల ప్రజలు నానా అవస్థలు పడుతున్నా ఏ ఒక్కరూ పట్టించుకున్న పాపానపోలేదు.

ఇక ఆర్టీసీ అధికారుల తీరు చెప్పనవసరమే లేదు. బస్సు సౌకర్యం కల్పించాలని మండలం చెందిన ప్రజలు, సదాశివనగర్ మండలానికి చెందిన భూంపల్లి లింగంపల్లి గ్రామాల ప్రజలు అనేకసార్లు ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అయినా నిమ్మకు నీరెత్తినట్టుగా ఆర్టీసీ అధికారులు స్పందించిన పాపన పోవడం లేదు. ఆర్టీసీ అధికారులు ప్రజా ప్రతినిధులు తక్షణమే స్పందించి కామారెడ్డి నుండి బాన్సువాడ వరకు నైట్ హాల్ట్ బస్సు సౌకర్యం కల్పించాలని గాంధారి, సదాశివ నగర్ మండల ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు అధికారులు మేల్కొని బస్సు సౌకర్యం కల్పించాలని రెండు మండలాల్లోని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రయివేటు వాహనలే దిక్కు

జహంగీర్ . వ్యాపారవేత్త గాంధారి



గాంధానికి నైట్ అవుట్ బస్సు సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నాం. వ్యాపారం నిమిత్తం హైదరాబాద్, కరీంనగర్, బైంసా తదితర దూర ప్రాంతాలకు వెళ్ళినప్పుడు రావడం కొద్దిగా లేట్ అవుతే 9:30 బస్సు లేకపోవడంతో ప్రైవేటు వాహనాలకు వందల్లో చెల్లించి ఇంటికి వస్తున్నాం.

బస్సుల కొరతతో..

డీపో మేనేజర్ మల్లేశం

కామారెడ్డి బస్టాండ్ నుంచి రాత్రి 9.30 గంటలకు కామారెడ్డి నుంచి బాన్సు వాడకు వెళ్లే రాత్రి బస్సుకు తగినంత మంది ప్రయాణీ కులు ఉండటం లేదు. దీంతో పాటు బస్సుల కొరత ఉండటంతో ఆ సమయంలో బస్సును రద్దు చేశాం.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు


గాయపడ్డ యువకులు

నవతెలంగాణ-బిచ్కుంద

ఒకే వరుసలో వెళ్తున్న రెండు బైకులు ఢీకొనడంతో ఒక వ్యక్తి స్వల్పంగా గాయపడగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బిచ్కుంద మండలంలోని కందర్ పల్లి, ఫత్లాపూర్ గ్రామాల మధ్య రిలియన్స్ పెట్రోల్ పంప్ సమీపాన జాతీయ రహదారిపై ఒకే వరుసలో వెళ్తున్న రెండు బైకులు ఢీకొనడంతో దౌల్తాపూర్ గ్రామానికి చెందిన షెట్టివార్ లక్ష్మణ్ తీవ్రంగా గాయపడగా, కొరియర్ బాయ్ గా పనిచేస్తున్న గుండె నెమలి గ్రామానికి చెందిన మోహన్ స్వల్పంగా గాయపడ్డాడు. ఘటన స్థలానికి చేరుకున్న స్థానికులు 108కు సమాచారం అందించి చికిత్స నిమిత్తం బిచ్కుంద ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాల పాలైన లక్ష్మణ్ పరిస్థితి విషమించడంతో కుటుంబీకులు నిజామాబాద్ లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఇటీవల నిర్మాణం పూర్తి చేసుకున్న జాతీయ రహదారి చెడిపోవడం వాటి మరమ్మతు పనులు మొదలు పెట్టగా మరమ్మతు పనులు జరుగుతున్న స్థలంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం ఎప్పుడూ రద్దీగా ఉండే ఈ రోడ్డుపైన పెద్ద వాహనాలు, ద్విచక్ర వాహన దారులు గమనించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపించారు.

ఉపాధి పనులు పరిశీలన

నవతెలంగాణ-తాడ్వాయి

తాడ్వాయి మండలంలోని చిట్యాల గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీలో భాగంగా చేపట్టిన కందకాల పనులను మండల అభివృద్ధి అధికారి రాజ్ వీర్ మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఉపాధి హామీ పనుల వద్ద సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలు వందరోజులు పని కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ మహిపాల్, ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

కారేగాంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి ఉమ్మడి మండలంలోని కారేగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆత్మీయ పదవ తరగతి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి, ప్రధానోపాధ్యాయులు సూర్య కుమార్, పీఆర్టీయూ నాయకులు గంగరాజు, కృష్ణమోహన్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

గాంధీనగర్ గ్రామ సందర్శన

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మండలంలోని గాంధీనగర్‌లోని నర్సరీ, పాఠశాల వంటగది పనులను జెడ్పీ సీఈవో గోవింద్, ఎంపీడీవో మల్లేష్ పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ స్వప్న పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభించిన ట్రాఫిక్ ఏసీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని బస్టాండ్ ఎదుట ఆటో డ్రైవర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, సీఐ చందర్ రాథోడ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు తప్పకుండా నియమ నిబంధనలను పాటించాలన్నారు. యూనిఫామ్ తప్పకుండా ధరించాలని, ట్రాఫిక్ ద్వారా ఇచ్చిన నంబర్లను వాహనానికి ఉంచాలని సూచించారు. లేనియెడల చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆటోలలో ప్యాసింజర్లను మితిమీరి ఎక్కించుకోవద్దని తెలిపారు. అవగాహన కార్యక్రమంలో సుమారు 20 మంది ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

లిల్లీపుట్, ప్రజ్ఞ హైస్కూల్లో ఉగాది వేడుకలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని లిల్లీపుట్ పాఠశాలలో మంగళవారం ఉగాది పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలందరూ సాంప్రదాయక దుస్తులతో వచ్చి అందర్నీ అలరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తరగతి గదులను మామిడి తోరణాలతో అలంకరించారు. తర్వాత ఉగాది పచ్చడి చేసి దాని ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంలో భాగంగా పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ మాట్లాడారు. ఉగాది పచ్చడి శ్రద్ధచాల సమ్మేళనంగా చేసే ఈ పచ్చడి జీవితంలో జరిగే వివిధ అనుభవాలను సూచిస్తుందని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణంలోని ప్రజ్ఞ హైస్కూల్‌లో..

ఉగాది పండుగ శ్రీ శోభకృత్ నామ (తెలుగు సంవత్సరాది) సంవత్సరమును పురస్కరించుకొని పాఠశాల విద్యార్థిని, విద్యార్థుల ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణంలో ప్రతి సంవత్సరము మాదిరిగానే పాఠశాల డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, కరస్పాండెంట్ జ్యోతి, ప్రిన్సిపాల్ శశికళ ఉపాధ్యాయుల సమక్షంలో ఘనంగా ఉగాది ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పీఈటీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పిప్రిలో కంటి వెలుగు ప్రారంభం


కంటివెలుగును ప్రారంభిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని పిప్రీ గ్రామంలో కంటివెలుగును మంగళవారం ప్రారంభించారు. సర్పంచ్ అసపురం దేవి శ్రీనివాస్‌రెడ్డి గ్రామపంచాయతీలో జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లు సోమ హేమంత్ రెడ్డి, గుండ లింగన్న, బీఆర్ఎస్ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ గ్రామానికి చెందిన జే శంకర్ కుమారుడు భవానీ ప్రసాద్ చికిత్స నిమిత్తం రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నిజాం మెడికల్ సైన్స్ ఆసుపత్రిలో గత కొన్ని రోజులుగా చికిత్స పొందుతున్న భవాని ప్రసాద్‌కు స్థానిక ఎమ్మెల్యే మొహమ్మద్ షకీల్ అమీర్ సహాయ సహకారాలతో సకాలంలో ఆర్థిక సాయం అందజేయడం వల్ల తన కుమారుడు చికిత్స పొందుతున్నాడని శంకర్ వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

రైతులకు శిక్షణ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి, పద్మాజివాడి క్లస్టర్ గ్రామ రైతువేదికలలో ఏఈవోలు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మి మంగళవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంటలలో చీడపురుగు ఆశిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలకు తెగులు సోగినట్లయితే వరి పంటలో ఎక్కువగా అగ్గితెగులు, ఆకు ముడత పురుగు ఆశించినది. అగ్గి తెగులు నివారణకు పికాగజిస్ట్రోబిన్ ట్రైసైక్లోజోన్ 2 లీటర్, నీటిలో కలిపి స్ప్రే చేయాలి. ఆకుముడత పురుగు నివారణకు క్లోరాంతనిల్‌ప్రోల్ 60 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి స్ప్రే చేయాలి. ఈ కార్యక్రమంలో మహేష్, డంగు వెంకటి, సంజీవులు, పయ్యావుల సిద్ధిరాములు, కుమ్మరి రాజలింగం, ఎర్ర రాములు, కుమ్మరి అంజయ్య, షేకెల్లి రాజయ్య, పైడి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

పోషక ఆహారంపై అవగాహన

నవతెలంగాణ-నసురుల్లాబాద్

పోషకాహారం లోపించకుండా ప్రతి ఒక్కరు పోషకాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వాణి తెలిపారు. సోమవారం మండలంలోని నెమ్లి గ్రామంలో పోషణ అభియాన్ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సంవత్సరం మార్చి 20 నుంచి ఏప్రిల్ 3 వరకు ప్రతి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్ పరిధిలో పోషణ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. దీంట్లో భాగంగా నెమ్లి గ్రామంలో గల అంగన్‌వాడీ సెంటర్‌లో చిరుధాన్యాల (మిల్లెట్స్) ఉపయోగంపై అవగాహన కల్పించారు. భోజనంలో రాగులు, సజ్జలు, జొన్నలు, సామలు, కొర్రలు మొదలైనవి అన్నీ వుండేటట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగామణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి, అంగన్‌వాడీ టీచర్లు జమున, సీతారామేశ్వరి, అంగన్‌వాడీ లబ్ధిదారు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మండలంలోని మల్కాపూర్ తండా గ్రామపంచాయతీ పరిధిలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక ఎంపీపీ బానోత్ అనూష ప్రేమ్‌నాయక్, సర్పంచ్ కేతావత్ హరిచంద్ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు మీసాల మధుకర్ రావు, ఎస్టీ సెల్ మండలాధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్, ఎస్టీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి వసంతరావు, ఉపసర్పంచ్ మోతీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రకాష్ నాయక్, ఐకెపి సిబ్బంది, మెడికల్ ఆఫీసర్ అలేఖ్య, పంచాయతీ సెక్రెటరీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.